

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | మంగళవారం 27-10-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:72 | పేజీలు:4 | వెల: రూ.1/-


# బొగ్గు కుంభకోణం కేసులో సంచలన తీర్పు

## కేంద్ర మాజీమంత్రి దిలీప్ రేకు మూడేళ్ల జైలు ఇద్దరు అధికారులకు జీవిత ఖైదు విధింపు

న్యూఢిల్లీ,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): కేంద్ర మాజీ మంత్రి దిలీప్‌కు మూడేళ్లు జైలు శిక్ష పడింది. బొగ్గు కుంభకోణం కేసులో సోమవారం ఢిల్లీ కోర్టు ఈ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. 1999లో జార్ఖండ్ బొగ్గు బ్లాక్ కేటాయింపుల్లో అవకతవకలకు సంబంధించిన కేసులో దిలీప్ రే దోషిగా తేలారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌తో పాటు నిందితుల వాదనలు విన్న ఢిల్లీ కోర్టు.. ఈ మేరకు తీర్పునిచ్చింది. కాగా, అటల్‌బిహారీ వాజ్‌పేయ్ ప్రభుత్వంలో దిలీప్‌రే ఇంధన శాఖ మంత్రిగా పని చేశారు. దిలీప్‌తో పాటు ఈ కుంభకోణంలో సంబంధం ఉన్న ఇద్దరు సీనియర్ అధికారులు ప్రదీప్ కుమార్ బెనర్జీ, నిత్యనంద్ గౌతమ్, కాస్టాన్ టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ మహేంద్ర కుమార్ అగర్వాల్‌లకు సీబీఐ కోర్టు జీవిత ఖైదు విధించింది.యితే బొగ్గు కుంభకోణానికి సంబంధించి శిక్ష విధించడం దేశ చరిత్రలో తొలిసారి. దిలీప్‌రేకు మూడుళ్ల శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధిచించారు ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ భరత్ పరాశర్. దీంతో పాటు క్యాస్టన్ టెక్‌కు రూ.60 లక్షలు, క్యాస్టన్ మైనింగ్ లిమిటెడ్‌కు రూ.10 లక్షల జరిమానా విధించారు. దీంతోపాటు క్యాస్ట్రన్ టెక్‌కు రూ.60లక్షలు, క్యాస్ట్రన్ మైనింగ్ లిమిటెడ్‌కు మరో 10లక్షల జరిమానాను విధించారు. సొంత ప్రయోజనాల కోసం నిబంధనలను ఉల్లంఘించినట్లు కోర్టు తెలిపింది. జార్ఖండ్‌లోని గిరిదిహ్‌లోని బ్రహ్మదిహ బొగ్గు బ్లాక్‌కు 1999లోఎ నిబంధనలకు విరుద్ధంగా సీటీఎల్‌కు కేటాయించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. నిబంధనలను ఉల్లంఘించి సీటీఎల్‌కు బొగ్గు మైనింగ్ ప్రాంతాన్ని కేటాయించడాన్ని కోర్టు తప్పుబట్టింది

# అంబర్‌పేటలో రావణ దహనం

## పాల్గొన్న కిషన్ రెడ్డి, విహెచ్

హైదరాబాద్,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): అంబర్‌పేటలో రావణ దహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హాజరయ్యారు. మహంకాళీ ఆలయం వద్ద 30 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది కరోనా కారణంగా కొద్దిమంది సందర్శకులకే అనుమతినిచ్చారు. అయితే విజయానికి సంకేతంగా దసరా పండుగను జరుపుకుంటారు. దసరా రోజు దేశవ్యాప్తంగా రావణ దహన వేడుకలు ఘనంగా జరుపుకుంటారు. శ్రీరాముడి చేతిలో రావణుడి ఓటమికి దసరా రోజు జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీరాముడి కాలం నుంచే విజయదశమిని విజయ ప్రస్థానంగా పరిగణించారు. ఈ రోజే రావణుడిపై రాముడు దండెత్తి విజయం సాధించారని చెబుతుంటారు. అందువల్ల రావణుడి దిష్టి బొమ్మను తగలబెట్టే సంప్రదాయం ఏర్పడిందని చెబుతుంటారు.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా డబుల్ ఇళ్లు

## జియాగూడలో ఇళ్లను ప్రారంభించిన మంత్రి కెటిఆర్
## బహిరంగ మార్కెట్లో ఒక్కో ఇల్లు 50 లక్షల చేస్తుంది
## ప్రారంభోత్సవంలో మంత్రి కెటిఆర్ వెల్లడి
## 14.88 కోట్ల ఖర్చుతో 840 ఇళ్ల నిర్మాణం
## కేటాయింపులు సరిగా లేవంటూ మహిళల ఆందోళన

హైదరాబాద్,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో టీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నదని మంత్రి కెటిఆర్ తెలిపారు. పేదలు గౌరవంగా బతకాలని సిఎం కెసిఆర్ వీటిని అత్యతంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారని అన్నారు. పేదల సొంత ఇంటి కలను ప్రభుత్వం విజయదశమి కానుకగా సాకారం చేసిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబార్ నగరంలోని జియగూడలో డిగ్నిటీ హౌసింగ్ కాలనీని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ క్రమంలో గోషామహల్ నియోజకవర్గంలోని గోడె కీ కబర్‌లో నూతనంగా నిర్మించిన 192 డబుల్ బెడ్ రూం ఇండ్లను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించారు.

ఈ ఇండ్ల నిర్మాణానికి రూ. 14.88 కోట్లు ఖర్చు చేశారు. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, దఫాలుగా వాటిని ప్రజలకు అందిస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం ఉదయం జియాగూడలోని 840 ఇండ్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వస్తాయని.. ఇళ్ల కోసం ఎవ్వరికీ డబ్బులు ఇవ్వవలసిన పని లేదన్నారు. జియాగూడను అభివృద్ధి చేస్తామని, ఒక బస్తీ దవాఖాన కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, జి హెచ్ ఎం సి కమిషనర్ డి ఎస్ లోకేష్ కుమార్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్వేతమొహంతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సభలో మహిళల ఆందోళన



భారతదేశంలో ఏ ప్రభుత్వం.. ఎక్కడ కూడా ఇలాంటి ఇళ్లు కట్టలేదని అన్నారు. తాము కట్టిన ఇళ్లకు మార్కెట్ లో రూ.40 నుంచి రూ.50 లక్షల ఖర్చు అవుతాయని, మొత్తం 2.5లక్షల ఇళ్ళకు రూ. 18 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. ఇచ్చిన ఇళ్లను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఒక సొసైటీని ఏర్పాటు చేసుకోవాలని మంత్రి అన్నారు. జియాగూడ ప్రాంతంలో ఉన్న మూసీని సుందరీకరణ చేస్తామని, దాంతో ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఈ హౌసింగ్ కాలనీలో రూ.71.49 కోట్ల వ్యయంతో 840 రెండు పడకగదుల ఇళ్లు నిర్మించారని తెలిపారు. ఈ కాలనీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా పేదకుటుంబాల కోసం అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉన్నాయన్నారు.

తాగునీరు, విద్యుత్, సి సి రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు బస్తీ దవాఖాన వంటి ఇతర సదుపాయాలను ప్రభుత్వం కల్పించందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కేటీఆర్ చెప్పారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు 560 చదరపు అడుగలలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల కోట్ల రూపాయలతో 2 లక్షల 75 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కడుతున్నామని ఆయన అన్నారు. ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ పారదర్శకంగా ఉంటుంది. ఈ విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను దశల వారిగా ఇస్తామని కేటీఆర్ తెలిపారు. డిగ్నిటీ హౌసింగ్ కాలనీ ప్రారంభ కార్యక్రమంలో కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతుండగానే సభా ప్రాంగణం వద్ద మహిళలు ఆందోళనకు దిగారు. కేసీఆర్ సర్కార్‌కు వ్యతిరేకంగా మహిళలు నినాదాలతో హోరెత్తించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీని పారదర్శకంగా చేయడంలేదంటూ మహిళల ఆరోపించారు. టీఆర్ఎస్ కార్యకర్తలకే ఇళ్లను కేటాయిస్తున్నారని మిగిలిన వాళ్లను పట్టించుకోవట్లేదంటూ మహిళలు మండిపడ్డారు. అయితే మంత్రి కేటీఆర్ మాత్రం మహిళలు ఆందోళనపై మాట్లాడలేదు. అక్కడ ఏర్పాటు చేసిన బస్తీ దవఖానాను కేటీఆర్ ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# భారత్ చేరుకున్న అమెరికా విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియో



న్యూఢిల్లీ, అక్టోబర్ 26: 2 + 2 సంభాషణల నిమిత్తం అమెరికా విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియో, రక్షణ కార్యదర్శి మార్క్ ఎస్పెర్ సోమవారం మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకున్నారు. మైక్ పాంపియో వెంట ఆయన భార్య సుసాన్ కూడా ఉన్నారు. వీరికి న్యూఢిల్లీలో దౌత్య అధికారులు ఘన స్వాగతం పలికారు. చర్చలు మంగళవారం జరుగనున్నాయి. రెండు రోజుల పర్యటన సందర్భంగా వీరు కేంద్ర మంత్రి జైశంకర్, రాజ్‌నాథ్‌సింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపి.. ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశం కానున్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు వారం రోజుల ముందుగా వీరి పర్యటన జరుగడం ప్రాధాన్యతనిస్తున్నది. మైక్ పాంపియో, మార్క్ ఎస్పెర్ తమ పర్యటనలో శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియాలను కూడా సందర్శించనున్నారు. ఈ ప్రాంతాల్లో చైనా యొక్క విస్తరణవాద నమూనాల నేపథ్యంలో వీరి పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఇండో-పసిఫిక్ కోసం అమెరికా-భారత్ ఉచితంగా, బహిరంగంగా, అభివృద్ధి చెందుతున్నాయి. మూడవ యూఎస్-ఇండియా 2 + 2 ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భద్రతా లక్ష్యాలను పంచుకోవడానికి ఇరు దేశాలు అందించే ఉన్నత స్థాయి నిబద్ధతను ప్రదర్శిస్తున్నాయని అమెరికా విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. రెండు దేశాలు తమ వ్యూహాత్మక, భద్రతా సంబంధాలను సమీక్షించడానికి, ద్వైపాక్షిక సంభాషణల్లో ఇండో-పసిఫిక్‌ను నిర్ధారించే మార్గాలను చర్చించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ చర్చలు ప్రాంతీయ భద్రతా సహకారం, రక్షణ సమాచార భాగస్వామ్యం, సైనిక పరస్పర చర్యలు, రక్షణ వాణిజ్యం అనే నాలుగు అంశాలపై దృష్టి సారించనున్నట్లు గత వారం యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపింది.

మొదటి రెండు ద్వైపాక్షిక సంభాషణలు 2018 సెప్టెంబర్ నెలలో న్యూఢిల్లీలో, 2019 లో వాషింగ్టన్ డీసీలో జరిగాయి. మూడవది ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగనున్నది. రెండు రోజుల పర్యటన సందర్భంగా మైక్ పాంపియో, మార్క్ ఎస్పెర్.. తమ భారత సహచరులైన ఎస్ జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్‌లతో ద్వైపాక్షిక చర్చలు జరిపి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమవుతారు. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా చాలా దౌత్య సమావేశాలు, పరస్పర చర్యలు ఆన్‌లైన్‌లోకి మారిన సమయంలో.. పాంపియో, ఎస్పెర్ వ్యక్తిగతంగా సందర్శించడం యొక్క ప్రాముఖ్యతను ఇరువైపుల అధికారులు ఎత్తిచూపారు. ఇది భారతదేశంతో సంబంధానికి ఉన్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని చెప్పవచ్చు.

# నిమ్స్‌లో మూడో దశ కోవాక్జిన్ పరీక్షలు

## ఏర్పాట్లు చేసిన అధికారులు

హైదరాబాద్,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): నిమ్స్ హాస్పిటల్‌లో మరో నాలుగు రోజుల్లో మూడో దశ భారత్ బయోటెక్ కోవ్యాక్సిన్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఐసీఎంఆర్ నుంచి అనుమతులు రావడంతో మూడో దశ పరీక్షలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నిమ్స్ ఎథిక్స్ కమిటీ సమావేశం జరుగనుంది. దాదాపుగా 100 నుండి 200 మందికి వ్యాక్సినేషన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టారు. డిసెంబర్ చివరినాటికి మూడో దశ పూర్తి అవుతుందని అధికారులు అంటున్నారు. ఫిబ్రవరి చివరి నాటికి తుది అనుమతులు పొంది వ్యాక్సిన్ మార్కెట్లోకి వచ్చే ఆస్కారం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఇదిలావుంటే నిమ్స్ నర్సెస్ యూనియన్ సభ్యులు ఆస్పత్రి డైరెక్టర్‌కు శనివారం సమ్మె నోటీస్ ఇచ్చారు. ఫ్యామిలీ ప్లానింగ్‌కు సంబంధించిన ఇన్సెంటివ్‌లు, కొవిడ్-19 సమయంలో రావాల్సిన ఇన్సెంటివ్‌లు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆ యూనియన్ ప్రెసిడెంట్ ఆశాలత తెలిపారు. ఇప్పటికే ఈ విషయమై డైరెక్టర్‌ను ఒకసారి కలిసి బకాయిల గురించి చెప్పామన్నారు. ఎంతో కాలంగా విధులు నిర్వహిస్తున్న నర్సులకు ఏ కారణం లేకుండా పదోన్నతులు ఆపారని వైస్ ప్రెసిడెంట్ ఎలిజబెత్ రాణి అన్నారు. ఇన్సెంటీవ్‌లు తక్షణమే చెల్లించకుంటే నవంబర్ 7వ తేదీ నుంచి సమ్మె నిర్వహిస్తామని ఆవె తెలిపారు. ఆస్పత్రి యాజమాన్య తీరును నిరసిస్తూ శనివారం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరిస్తున్నామన్నారు.

# లేహ్‌లో బీజేపీ హవా.. పదింటిలో బీజేపీ.. రెండింటిలో కాంగ్రెస్ గెలుపు

లేహ్, అక్టోబర్ 26: లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్‌హెచ్‌డీసీ) లేహ్ జనరల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగుతున్నది. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల్లో బీజేపీ పది స్థానాల్లో విజయం సాధించగా.. రెండు చొప్పున సీట్లలో కాంగ్రెస్, స్వతంత్రులు గెలుపొందారు. అక్టోబర్ 22 న జరిగిన ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించారు. 26 నియోజకవర్గాలలో ఇప్పటివరకు 14 స్థానాల ఫలితాలను ప్రకటించారు.

ఇప్పటివరకు - తుర్తుక్, హుందార్, డిస్కిట్, టెగర్, పనామిక్, టాంగ్త్సే, కోర్జోక్, మార్ట్సెలాంగ్, కుంగ్యం, తిక్సే నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించగా.. చుషుల్ నియోజకవర్గాన్ని కొంచోక్ స్టాన్జిన్ (ఇండిపెండెంట్), న్యోమాను ఇషే స్పాల్జాంగ్ (ఇండిపెండెంట్) గెలుచుకున్నారు. సాక్తీ, ఇగూ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు వరుసగా 20, 79 ఓట్ల మెజార్టీతో గట్టెక్కారు. హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో తొలిసారిగా ఈవీఎంలను ఉపయోగించారు. ప్రతి రౌండ్లో ఏడు ప్రాదేశిక నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తున్నారు. 2019 లో ఈ ప్రాంతానికి కేంద్రపాలిత హోదా ఇచ్చిన తరువాత ఇదే మొదటి ప్రజాస్వామ్య ఎన్నికలు కావడం విశేషం. లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, లేహ్ ఎన్నికలకు పోలింగ్ అక్టోబర్ 13, 14 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభమైంది. అక్టోబర్ 22 న లేహ్ జిల్లా వ్యాప్తంగా 26 నియోజకవర్గాల్లో 294 పోలింగ్ బూత్‌లలో తుది పోలింగ్ జరిగింది. మొత్తం 54,257 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94 మంది అభ్యర్థుల విధిని నిర్ణయించడానికి వీరే కాకుండా 2,538 పోస్టల్ బ్యాలెట్లు, 1,635 ఈడీసీ ఓట్లు కూడా ఈ రోజు లెక్కించనున్నారు. మొత్తం 26 ప్రాదేశిక నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి. లడఖ్ రాజకీయాల్లో కొత్తగా ప్రవేశించిన ఆమ్ ఆద్మీ పార్టీ 19 మంది అభ్యర్థులను నిలబెట్టింది. 23 మంది స్వతంత్రులు కూడా రంగంలో ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టలేదు.

# వీధి వ్యాపారులకు రుణాలు

## -నేడు లాంఛనంగా ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ చేయనున్నట్లు సమాచార శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి నవనీత్ సెహగల్ చెప్పారు. ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి యోజన (పీఎం స్వనిధి స్కీమ్) క్రింద దాదాపు 3 లక్షల మంది వీధి వ్యాపారులకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రుణాలు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. పీఎం స్వనిధి పథకం క్రింద వీధి వ్యాపారులు రాయితీ వడ్డీపై రూ.10,000 వరకు వర్కింగ్ కేపిటల్‌ను పొందవచ్చు. పేద వీధి వ్యాపారులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని జూన్ 1న ప్రారంభించింది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా దెబ్బతిన్నవారి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రుణ సదుపాయం కల్పిస్తున్నది. స్వయం సమృద్ధి భారత దేశం లక్ష్యంగా అణగారిన వర్గాలవారిని అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం. ఇప్పటి వరకు 24 లక్షల మందికి పైగా రుణాల కోసం దరఖాస్తు చేశారు. వీరిలో సుమారు 12 లక్షల మందికి రుణాలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.5.35 లక్షల రుణాలను పంపిణీ చేశారు.

# నేపాలీ దొంగజంట అరెస్ట్

## పని మనుషులుగా నమ్మించి మత్తు ఇచ్చి చోరీ

హైదరాబాద్,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): నాచారం చోరీ కేసులో నేపాలీ ముఠాను అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఇంట్లో పని మనషులుగా చేరిన నేపాలీ వాసులు అర్జున్, మాయ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి చోరీ చేసినట్లు నిర్ధారించారు. నాచారం హెచ్‌ఎంటీ నగర్ వాసి ప్రదీప్ కుమార్ ఇంట్లో పదిహేను రోజుల క్రితం.. నేపాలీ వాసులు అర్జున్, మాయ పని మనషులుగా దిగారు. తామిద్దరం భార్యాభర్తలమని ప్రదీప్ కుమార్‌ను నమ్మించారు. కానీ వీరు దంపతులు కాదు. అయితే ఈ నెల 19వ తేదీన ప్రదీప్ కుమార్, తన కుమారుడు ఆఫీస్‌కు వెళ్లిపోయారు. అదే రోజు ప్రదీప్ భార్య, కూతురు కలిసి మెదక్‌కు ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఆ తర్వాత ప్రదీప్ తల్లి(70)కి మత్తు మందు ఇచ్చి ఇంట్లో ఉన్న 19 తులాల బంగారం, రిస్ట్ వాచ్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను దొంగిలించారు. ఆ రోజు రాత్రి 9 గంటల సమయంలో ప్రదీప్ ఇంటికి రాగా, తల్లి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో ఆయన నాచారం పోలీసులను ఆశ్రయించాడు. ప్రదీప్ ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఈ కేసును ఛేదించినట్లు పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ తెలిపారు.

# శామీర్‌పేటలో బాలుడి కిడ్నాప్..హత్య

మేడ్చల్ మల్కాజ్‌గిరి, అక్టోబర్26 (ఆర్ఎన్ఎ): ఈ నెల 15వ తేదీన శామీర్‌పేటలో అదృశ్యమైన బాలుడు మృతి చెందాడు. శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు పక్కన బాలుడి మృతదేహం లభ్యమైంది. ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతియాన్(5) అనే అబ్బాయి అదృశ్యమైన విషయం తెలిసిందే. అదే రోజు తమ అబ్బాయి కనిపించడం లేదంటూ అతని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఔటర్ రింగ్ రోడ్డు వద్ద బాలుడి మృతదేహం లభ్యమైంది. బాలుడిని కిడ్నాప్ చేసి హత్య చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. బాలుడి మృతి కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# దుబ్బాకలో గెలుపుతో మార్పుకు శ్రీకారం

## బిజెపి దూకుడుతో మంత్రికి ముచ్చెమటలు: రఘునందన్ రావు

సిద్దిపేట,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): దుబ్బాక ప్రచారంలో బిజెపి ముందున్నదని, గెలువు దిశగా తమ ప్రచారం సాగుతున్నదని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఈ ఎన్నిక దుబ్బాక ప్రజల ఆత్మాభిమాన పోరాటమని తెలిపారు. తమ ప్రచారంతో అధికార టిఆర్ఎస్‌లో కలవరం మొదలయ్యిందని అన్నారు. మంత్రి హరీష్ రావుకు ముచ్చెమటలు పట్టి దుబ్బాకలోనే మకాం వేశారని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు మూలంగా దుబ్బాక నియోజకవర్గం పూర్తిగా అన్యాయానికి గురైందని విమర్శించారు. గ్రామగ్రామాన బీజేపీకి ప్రజాధరణ పెరుగుతున్నదని గ్రహించిన అధికార పార్టీ తప్పుడు కేసులు, వేధింపులతో బెదిరించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఒక్క కార్యకర్తకు నష్టం జరిగినా ప్రాణాలను అడ్డుపెట్టి అయినా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. దుబ్బాక ఎన్నికలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్నింటినీ ప్రజలు గ్రహిస్తున్నారని, టీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. మంత్రి హరీశ్‌రావు అనుచరగణం ఇక్కడి నాయకత్వాన్ని అజమాయిషీ చేస్తున్నారని, చీమునెత్తురు ఉన్న దుబ్బాక నాయకత్వం వారిపై తిరగబడాలని పిలుపునిచ్చారు. ఎన్నాళ్లు సిద్దిపేట పెత్తనం మీద తలవంచి దుబ్బాక ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెడతారని ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గానికి రావాల్సిన నిధులను సిద్దిపేట, గజ్వేల్‌లకు తరలించారని విమర్శించారు. దుబ్బాకలో శంకుస్థాపన చేసుకున్న పాలిటెక్నిక్ కళాశాలను సిద్దిపేటకు తరలించారని ధ్వజమెత్తారు. దుబ్బాక నాయకుడిని క్యాంపు కార్యాలయానికి పరిమితం చేసి, ఉన్న నిధులను అప్పనంగా తీసుకెళుతున్న దొంగలని విమర్శించారు. సీఎం కేసీఆర్‌కు నిజంగా దుబ్బాకలో చదివిన ప్రేమ ఉంటే కాల్వల్లో భూములు కోల్పోయిన రైతులకు కనీస పరిహారం ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. దుబ్బాక ప్రాంతం ప్రజలు ముంపు, కంపుతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికతో టీఆర్ఎస్‌కు చెంప చెల్లుమనిపించేలా తీర్పునివ్వాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ ఓటమితోనే సీఎం కేసీఆర్‌కు కనువిప్పు కలుగుతుందని తెలిపారు. దుబ్బాకలో గెలుపుతో రాజకీయాల్లో మార్పునకు శ్రీకారం చుట్టాలని ఆయన ప్రజలను కోరాడు

## చరిత్రలో నేటినిజం



కం॥ వినసొంపుగ మధురమ్ముగ
స్గానముల నందించినట్టి వనితామణియౌ
"అనురాధాపోడ్వాల"ను
ఘన తరముగ ప్రస్తుతింతు గాయని గణమున్!!

( అక్టోబర్ 27 అనురాధా పొడ్వాలు జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210






## కృష్ణానదిలో వేడుకగా తెప్పోత్సవం

విజయవాడ,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కృష్ణానదిలో హంస వాహనంపై దేవతా మూర్తులను ఊరేగించారు. కరోనా నేపథ్యంలోనిబంధనలు పాటిస్తూ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో హంస వాహనంపైకి పరిమిత సంఖ్యలో వీఐపీలు, అధికారులకు అనుమతిచ్చారు. శివాలయం మెట్ల దారి నుంచి దుర్గాఘాట్ వరకు ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదిలో జలవిహారం లేకుండానే అధికారులు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

## పండగ ప్రయాణికులకు తప్పని తిప్పలు

కరీంనగర్,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): దసర పండగ సందర్భంగా కొద్దోగొప్పో మంది జిల్లాలకు వెళ్లాలనుకున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కారోనా కారణంగా బస్సులు బంద్ ఉండటంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. తగినన్ని సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందుల పడ్డారు. దీనికితోడు రైలు సర్వీసులు పూర్తి స్థాయిలో పునరుద్దరణకు నోచుకోలేదు. దూరప్రాంతాలకు వెళ్లే వారి నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేశారు. సికింద్రాబాద్, హన్మకొండ, గోదావరిఖని, నిజామాబాద్, సిరిసిల్ల, వేములవాడ తదితర ప్రాంతాలకు వెళ్లాలనుకున్న వారు సొంత వాహనాలను ఆశ్రయించారు. కరోనా కారణంగా 90 శాతం మంది ప్రయాణికులు ఇప్పటికే స్వగ్రామాలకు చేరుకోవడంతో ప్రయాణికుల రద్దీకూడా అంతగా కనిపించలేదు. ఆర్టీసీ యాజమాన్యం బస్సులు ఏర్పాటు చేసినా ప్రయాణికులు అనుకున్నంత రాక బస్టాండ్ వెలవెలబోయింది.

## ఇరువర్గాల ఘర్షణలో పలువురికి గాయాలు

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్26(నేటినిజం ప్రతినిధి):: ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి పరస్పరం కర్రలతో ఇరు వర్గాలు దాడి చేసుకున్నాయి. ఇరు వర్గాల దాడిలో 8 మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలోనే ఇరు వర్గాల మధ్య దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రామోజీపేటలో పోలీసులు మోహరించారు.

## టిడిపి నేతల అరెస్ట్ దారుణం

### -మహాపాదయాత్రను అడ్డుకోవడంపై బాబు మండిపాటు

చిత్తూరు,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): జిల్లాలో టీడీపీ నాయకుల అక్రమ అరెస్టులను ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఖండించారు. హంద్రీ – నీవా పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రామకుప్పం నుంచి టీడీపీ మహా పాదయాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికమని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తున్న టీడీపీపై అణచివేత చర్యలను ఖండిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పులివెందులకు నీళ్లిచ్చి చీనీ చెట్లు ఎండిపోకుండా కాపాడామని... అలాంటిది ఇప్పుడు కుప్పం నియోజకవర్గంపై ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను గర్హిస్తున్నామని వ్యాఖ్యానించారు. తక్షణమే టీడీపీ నాయకులపై గృహనిర్బంధం ఎత్తివేయాలని, అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. రైతాంగ వ్యతిరేక చర్యలకు వైసీపీ స్వస్తి చెప్పాలన్నారు. కుప్పం రైతుల సాగునీటి సమస్యలు, తాగునీటి ఎద్దడి తక్షణమే పరిష్కరించాలని... హంద్రీ – నీవా ఎత్తిపోతల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు.

## దేవరగట్టు కర్రల సమరంపై ఆంక్షలు

### -నిషేధం విధించిన జిల్లా కలెక్టర్

కర్నూలు,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): కర్నూలు జిల్లాలో దసరా నేపథ్యంలో యేటా జరిగే దేవరగట్టు కర్రల సమరంపై కరోన ప్రభావం పడింది. మహమ్మారి వ్యాప్తి విస్తృతి నేపథ్యంలో కర్రల సమరంపై జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. కర్నూలు జిల్లా దేవరగట్టులో మాల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద దసరా సందర్భంగా కర్రల సమరం జరుగుతుంది. మల్లేశ్వరుల ఉత్సవ విగ్రహాల కోసం పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఈ ఉత్సవాలను చూడటానికి లక్షలాది మంది హాజరవుతారు.

అయితే కరోనాతో ఈ ఉత్సవాలను రద్దు చేస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ వీరపాడియన్ ఆదేశాలు జారీచేశారు. రాత్రి జరిగే ఈ ఉత్సవాన్ని చూడటానికి ఎవరూ రాకూడదని ఆంక్షలు విధించారు. దీంతో దేవరగట్టుకు రాకపోకలపై పోలీసులు నిషేధం విధించారు. గ్రామానికి వెళ్లే రహదారులను మూసివేశారు. ఉత్సవ నిషేధంపై ఇప్పటికే అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## విశాఖలో మెట్రో రైలు కార్యాలయం

### – దసరా సందర్భంగా ప్రారంభం

విశాఖపట్టణం,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రాంతీయ కార్యకలాపాలు విశాఖ నుంచి ప్రారంభం అయ్యాయి. మంత్రులు బొత్స సత్యనారాయణ, అవంతి శ్రీనివాస్ ఆదివారం విశాఖనగరంలో ఎల్ఐసీ భవన్ మూడో అంతస్తులో రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెట్రో రైల్ ప్రాజెక్ట్ ప్రజెంటేషన్‌ను అధికారులు మంత్రులకు వివరించారు. కాగా విశాఖలో 60.29 కిలోమీటర్ల మేర మోడ్రన్ ట్రామ్ కారిడార్, 79,91 కిలోమీటర్ల మేర లైట్ మెట్రో కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో అధికారులు ఇక్కడ నుంచే ఈ ప్రాజెక్ట్‌ను పరిశీలించేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ సందర్భంగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డీపీఆర్‌పై కన్సల్టెంట్లతో చర్చలు, ఇతర అంశాలపై చర్చించాలనే ఉద్దేశంతో విశాఖలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేసారు. వచ్చే రెండు నెలల్లో మెట్రో ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధం కానున్నాయి. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న అవసరాల దృష్ట్యా మెట్రో దూరాన్ని పెంచమని చెప్పారు. మొదట గాజువాక నుంచి కొమ్మాది వరకూ మెట్రో అనుకున్నామని' ఆయన అన్నారు. దసరా కావడంతో మెట్రో రైల్ కార్యాలయం ప్రారంభించాం. యూఎంటీసీ సంస్థకు మెట్రో డీపీఆర్ తయారు చేయమని చెప్పాం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మెట్రో రైలు స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ దూరం పెంచి డీపీఆర్ తయారు చేస్తున్నాం. నవంబర్ మొదటి వారంలో డీపీఆర్ ఇస్తామని చెప్పారు. విశాఖ మెట్రోకు కేంద్ర సహాయ సహకారాలు అవసరం. డీపీఆర్ తయారు చేశాక ముఖ్యమంత్రి ఆమోదంతో టెండర్లు పిలుస్తాం. విశాఖను దేశంలో గొప్ప నగరంగా అభివృద్ధి చేయాలని చూస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.

## వేడుకగా పార్వేట ఉత్సవం

### -శ్రీవారి ఆలయంలోనే వేడుకల నిర్వహణ

తిరుమల,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజైన ఆదివారం శ్రీవారి ఆలయంలో విజయదశమి పార్వేట ఉత్సవం ఏకాంతంగా జరిగింది. సంక్రాంతి కనుమ పండుగ రోజు కూడా తిరుమలలో పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీ మలయప్ప స్వామివారిని వేంచేపు చేశారు. శ్రీమలయప్పస్వామివారు పంచాయుధాలైన శంఖం, చక్రం, గద, ఖడ్గం, ధనస్సు ధరించి పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో భాగంగా టిటిడి ఈవోకు ఆలయ మర్యాద ప్రకారం పరివట్టం కట్టారు. కోవిడ్–19 నిబంధనల కారణంగా ఆలయంలోని కల్యాణోత్సవ మండపం ఆవరణంలో టిటిడి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏడుకొండలతో పాటు శేషాచలాన్ని తలపించేలా రూపొందించిన నమూనా అడవిలో వివిధ రకాల చెట్లు, రాళ్లు ఏర్పాటు చేశారు. అందులో వన్యమృగాల బొమ్మలను ఉంచారు. ఈ ప్రాంతంలో స్వామివారు వేటలో పాల్గొన్నారు. అనంతరం విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టి స్వామివారిని రంగనాయకుల మండపంలోకి వేంచేపు చేశారు. ర్వేట ఉత్సవం అనంతరం ఆలయం వెలుపల ఈవో మీడియాతో మాట్లాడుతూ లోకకల్యాణం, కరోనా నివారణ కోసం శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఆలయంలోనే ఏకాంతంగా నిర్వహించామని చెప్పారు. కోవిడ్ వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా పార్వేట ఉత్సవాన్ని కూడా ఆలయంలో ఏకాంతంగా నిర్వహించామన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన జీయర్‌స్వాములకు, అర్చకస్వాములకు, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సింగరేణిపై పట్టుకోసం బిజెపి నేతల నజర్

### కార్మిక సంఘం బలోపేతం కోసం ప్లాన్
### వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న నేతలు
### ప్రతివ్యూహంతో సాగుతున్న టీఆర్ఎస్ నాయకులు

కొత్తగూడెం,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): గతంలో ఎప్పుడూ లేనంతంగా సింగరేణిపై బిజెపి దృష్టి సారించింది.తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి పరిధిలో పట్టుకోసం బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతం వెంట విస్తరించి ఉన్న కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పట్టు సాధించాలని చూస్తోంది. ఇందులో భాగంగా సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న సుమారు 50వేల మంది పర్మనెంట్ ఉద్యోగులను, 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆకర్షించడం ద్వారా ఈ ప్రాంతం విస్తరించి ఉన్న 11 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పట్టు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నట్లు తెలుస్తోంది.

సింగరేణిని నష్టాల్లో ముంచారని బిజెపి పదేపదే విమర్శలు చేస్తోంది. సింగరేణిలో పట్టుకోసం బీజేపీ చేపట్టిన వ్యూహం అధికార టీఆర్ఎస్ నాయకులను కలవరపెడుతోంది. సింగరేణి పరిధిలో పార్టీ బలోపేతం బాధ్యతలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పార్టీ జాతీయ నాయకత్వం అప్పగించినట్లు సమాచారం. సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో కార్మిక క్షేత్రంగా ఉన్న ఆరు జిల్లాల నేతలతో కిషన్‌రెడ్డి టచ్‌లో ఉంటూ బీఎంఎస్ బలోపేతానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో టీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల నుంచి బలమైన నాయకులను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు జరుగుతు న్నాయి. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని సింగరేణి కార్మికులతో సంబంధాలు గల మాజీ ఎంపీ గడ్డం వివేక్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ యపార్టీలో పెద్ద ఎత్తున కూడా చేర్చుకున్నారు. ఆయా నియోజకవర్గాల నేతలు సింగరేణి కార్మికులను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో మునిగిపోయారు. మరోవైపు టీఆర్ఎస్ కూడా మునుపటి పట్టుకోసంయత్రాలు చేస్తోంది. ఇప్పటికే బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్ ఏరియాలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు గనులపై పర్యటించి తామున్నామంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వనమా వెంకటేశ్వరరావు గనులపై సమావేశాలు నిర్వహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామని హామీ ఇస్తున్నారు. రామగుండంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్మిక సంఘాల నాయకులతో చర్చిస్తున్నారు. బీఎంఎస్‌లోని టీఆర్ఎస్, టీబీజీకేఎస్‌కు చెందిన ముఖ్య నేతలతో పాటు కార్మికులెవరూ వెళ్లకుండా కట్టడిచేసే ప్రయత్నంలో ఉన్నారు.

ఈ మేరకు రాష్ట్ర అధిష్టానం నుంచి స్పష్టమైన దిశానిర్దేశం వచ్చినట్లు సమాచారం.గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తెలంగాణ రాష్ట్ర సమితి సింగరేణి బెల్ట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరులలో మినహా మిగతా 8 చోట్ల పరాజయాన్ని మూట గట్టుకొన్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు తరువాత పరిణామాల్లో టీఆర్ఎస్‌లో చేరినప్పటికీ, ప్రజాభిప్రాయం భిన్నంగా ఉందనే విషయాన్ని బీజేపీ గుర్తించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ద్వారా తన ప్రణాళికను అమలు చేసే ఆలోచనతో ఉంది. సింగరేణిలో ఎన్నికల్లో ఈసారి గుర్తింపు యూనియన్‌గా బీజేపీ అనుబంధ విభాగమైన బీఎంఎస్‌ను గెలిపించి కార్మిక క్షేత్రంలో పట్టునిలుపుకోవాలని ఆ పార్టీ నాయకులు కృత నిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి ఈబాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియా గులాబీదళానికి అండగా నిలిచింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి పరిధిలోని నియోజక వర్గాల్లో ఖమ్మం జిల్లాలో మినహా దాదాపు అంతటా టీఆర్ఎస్ జయకేతనం ఎగరేసింది. 2017లో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందని తొలుత భావించినా, కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి ప్రణాళిక అమలు చేయడంతో భూపాలపల్లి, మందమర్రి మినహా అన్ని ఏరియాల్లో టీబీజీకేఎస్ ఘన విజయం సాధించింది. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో కూడా సింగరేణి ప్రాంతం పరిధిలోని పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో తమకు ఢోకా లేదని టీఆర్ఎస్ నేతలు ధీమాగా ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్సీగా గెలిచిన కవిత కూడా మళ్లీ రంగంలోకి దిగుతారని భావిస్తున్నారు.

# గీతం కూల్చివేతలపై సర్వత్రా నిరసనలు

### ప్రభుత్వ చర్యను తప్పుపట్టిన స్థానికులు
### రాజకీయ కక్షపూంత చర్య అన్న పార్టీల నేతలు

విశాఖపట్టణం,అక్టోబరు 26(ఆంఎన్ఎ): గీతం విద్యాసంస్థల ప్రహరీని అర్ధరాత్రి కూల్చడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇంతకాలం అధికారంలో ఉన్న అవంతి శ్రీనివాస్, బొత్స సత్యనారా యణలకు గీతం ఆక్రమణలు కానరాలేదా అని నిలదీస్తున్నారు. ఒకవేళ ఆక్రమణలు ఉంటే వారికి నోటీసులు ఇచ్చి, ఆక్రమించిన స్థలానికి బహిరంగ మార్కెట్ రేటును వసూలు చేసి ఉంటే బాగుండేదని స్థానికులు అభిప్రాయ పడ్డారు. ఇప్పుడు గీతం విశ్వవిద్యాలయంపై కూడా శనివారం నాడే వందలాది మంది సిబ్బందితో దాడి చేసి నిర్మాణాలు కూలగొట్టారు. ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. ప్రపంచ స్థాయి పేరు ప్రతిష్టలున్న సంస్థపై దాడి చేస్తే దానివల్ల రాష్ట్రానికే చెడ్డపేరు వస్తుందనే చిన్న విషయాన్ని..అటు నాయకులు, ఇటు అధికారులు విస్మరించారు. గీతం రాత్రికి రాత్రి నిర్మాణాలు చేయలేదు. అయినా కూల్చివేశారు. ఇదిలావుంటే ఉగ్రవాదులపై దాడులు చేసినట్టుగా కూల్చాల్సిన అవసరం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. ఆస్పత్రి కోసం కొంత ప్రభుత్వ భూమిని లోగడ తీసుకున్నామని గీతం మూర్తి చెప్పారన్న విషయాన్ని నారాయణ గుర్తు చేశారు. సీఎం జగన్ విధ్వంసంతోనే పాలన మొదలుపెట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములకు సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని, సీఎం జగన్‌కు ఖలేజా ఉంటే ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని సవాలు విసిరారు. విశాఖలో గీతం విద్యా సంస్థల కట్టడాల కూల్చివేత కక్ష సాధింపు చర్యేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ఒక పక్క వరదలు, మరోపక్క కరోనా విపత్తులతో ప్రజలు అల్లాడుతుంటే.. ఈ ప్రభుత్వానికి పట్టకపోగా ఇటువంటి దుందుడుకు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పరదేశిపాలెంలో మాజీ మంత్రి ధర్మాన తన కుమారుడి పేరుతో ప్రభుత్వ భూములు కాజేశారని, కొమ్మాది సర్వే నంబర్ 28/2లో పది ఎకరాల భూమిని కె.శ్రీనివాసరెడ్డి, సర్వే నంబర్ 154/3లో మిరియాల సుగుణమ్మ 5 ఎకరాలు కాజేశారని, వారిపై చర్యలు ఏవని ప్రశ్నించారు. విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంపై దాడికి పాల్పడి విధ్వంసం సృష్టించడం ప్రభుత్వ టెర్రరిజానికి నిదర్శనమని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికే విద్యా వైద్య పారిశ్రామిక సంస్థలు ఏపీకి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ రాష్ట్రాన్ని దక్షిణాది బిహార్ అని పిలుస్తూ అనేక కంపెనీలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ప్రభుత్వ వైఖరికి గీతం సంఘటన మరోసారి అద్దం పట్టింది. అత్యున్నత విద్యా సంస్థ 'గీతం' కూల్చివేతను ఖండిస్తున్నాను. కోర్టులో ఉన్న వివాదంపై ఏ ఆదేశాలు రాకముందే కూల్చివేయడం వైసీపీ కక్ష సాధింపునకు నిదర్శనం. ప్రతిష్టాత్మక విద్యాసంస్థపై ఇటువంటి విధ్వంసానికి దిగడం రాష్ట్ర ప్రగతికి చేటన్నారు. గీతంపై దాడి ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మాజీమంత్రి అయ్యన్న పాత్రుడు అన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులే దీనిని ఎక్కువగా ఉపయోగించుకున్నారన్నారు. విశాఖలో విజయసాయిరెడ్డి ఏది చెబితే అది చేస్తున్నారని, దీనివల్ల జగన్ నిండా మునిగిపోవడం ఖాయమన్నారు. జగన్ తండ్రి వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు గీతంపై దాడికి దిగారని, కానీ సలహాదారుల మాటలువిని ఆయన వెనకడుగు వేశారనారు. గీతం 37 ఎకరాలు ఆక్రమించిందని చెబుతున్నారని, ఆ భూమి అంతా ప్రభుత్వం స్వాధీనంలోనే ఉందన్నారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అయ్యన్న ఆరోపించారు. గీతం ప్రధాన ప్రవేశ ద్వారం ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన భూమిలో నిర్మించారని, దానిని అధికారులు ఎలా వదగొడతారని ప్రశ్నించారు.

# ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్‌కు కరోనా

### దేశంలో తగ్గుముఖం పట్టిన కేసుల సంఖ్య

న్యూఢిల్లీ,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ కరోనా బారినపడ్డారు. తనకు కరోనా లక్షణాలేవీ లేకపోయినప్పటికీ కోవిడ్–19 నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. తనకు కరోనా సోకిన నేపథ్యంలో తనతో సన్నిహితంగా మెలిగినవాంతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం తాను క్షేమంగానే ఉన్నానని, ఐసోలేషన్ లోనే విధులు నిర్వర్తించనున్నానని చెప్పారు. నలుగురు డిప్యూటీ గవర్నర్లు బీపీ కనుంగో, ఎంకే జైన్, ఎండి పత్రా, ఎం రాజేశ్వర్ రావు నేతృత్వంలో బలంగా ఉన్న ఆర్‌బీఐ కార్యకలాపాలు యధావిధిగా కొనసాగుతాయని గవర్నర్ ట్వీట్ చేశారు. కరోనా సంక్షోభం, లాక్‌డౌన్ కాలంలో కార్యకలాపాలను సమీక్షిస్తూ, ఆర్థిక వృద్ధిని పునరుద్ధరించే ప్రయత్నాలతో గవర్నర్ బిజీగా గడిపిన సంగతి తెలిసిందే. కాగా దేశంలో కరోనా విస్తరణ కాస్త తగ్గుముఖం పట్టినట్టు కనిపిస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం నాటి గణాంకాల ప్రకారం 78 లక్షలకు పైగా కేసులు నమోదవగా, మరణాల సంఖ్య 1.18 లక్షలకు చేరుకుంది. మరోవైపు దేశంలో కరోనా మహమ్మారి కేసులు భారీగా తగ్గుతూ వస్తున్నాయి. నిన్న 50 వేల పాజిటివ్ కేసులు నమోదవగా, తాజాగా దానికి ఐదు వేలకుపైగా తక్కువ కరోనా కేసులు రికార్డయ్యాయి. దీంతో దేశంలో 79 లక్షల మార్కును దాటాయి. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో 45,149 మంది కొత్తగా కరోనా బారినపడ్డారు. దీంతో దేశంలో కరోనా బాధితుల సంఖ్య 79,09,960కి చేరింది. ఇందులో 6,53,717 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. నిన్న మరో 59,105 మంది కరోనా నుంచి కోలుకోవడంతో మొత్తంగా 71,37,229 మంది బాధితులు కరోనా నుంచి బయటపడ్డారు. ఆదివారంఉదయం నుంచి సోమవారం వరకు కరోనాతో 480 మంది మరణించారు. దీంతో కరోనా మృతుల సంఖ్య 1,19,014కు చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. దేశంలో నిన్నటివరకు 10,34,62,778 నమూనాలను పరీక్షించామని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్మార్) ప్రకటించింది. అక్టోబర్ 25న 9,39,309 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని తెలిపింది.

# వరద బాధితులకు టీఆర్ఎస్ ఎన్నారై యూకే బృందం సహాయం

హైదరాబాద్, అక్టోబర్ 26 : హైదరాబాద్‌లోని వరద బాధితులకు టీఆర్ఎస్ ఎన్నారై యూకే బృందం నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. వరద బాధితులకు సాయం చేయాలనే సంకల్పంతో "వీ – కేర్ మేమున్నాము" అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు టీఆర్ఎస్ ఎన్నారై యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి తెలిపారు.

నిత్యావసర సరుకులతో పాటు జ్వరం, జలుబు మరియు ఇతర నొప్పులకు ఉపయోగపడే మందులను డాక్టర్ సలహా మేరకు ఉచితంగా పంపిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొదటి విడతగా సుమారు 300లకు పైగా కిట్లను హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాల్లో పంపిణీ చేశామని తెలిపారు. సుమారు 200 కిట్లను ఘట్కేసర్ మండలంలోని చౌదరిగూడ గ్రామంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు అశోక్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం చేపట్టడం పట్ల టీఆర్ఎస్ ఎన్నారై బృందాన్ని మర్రి రాజశేఖర్ రెడ్డి అభినందించారు. కష్టాల్లో ఉన్న వారిని




ఆదుకునేందుకు ముందుకు వచ్చిన టీఆర్ఎస్ ఎన్నారై వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, అధ్యక్షులు అశోక్ గౌడ్ దూసరిని మరియు కార్యవర్గ సభ్యులని ఆయన ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీఆర్ఎస్ నాయకులు, టీఆర్ఎస్ ఎన్నారై యూకే నాయకులు మల్లేష్ పప్పుల, ప్రవీణ్ పంతులు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ కేసులో అమెజాన్‌కు ఊరట....

ఢిల్లీ, అక్టోబర్ 26: ఫ్యూచర్ గ్రూప్–రిలయన్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ఫ్యూచర్ గ్రూప్ రిటైల్ బిజినెస్ వ్యాపారాన్ని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్(ఆర్ఆర్ వీఎల్)కు రూ.24,713 కోట్లకు విక్రయించడంపై అమెజాన్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఇక్కడ అమెజాన్‌కు ఊరట లభించింది. సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ సానుకూలంగా స్పందించింది. ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అమెజాన్‌కు తాత్కాలిక ఊరట లభించింది. ఆర్బిట్రేషన్ మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు అమెజాన్ తెలిపింది.

సరైన న్యాయసలహా ప్రకారం ఫ్యూచర్ రిటైల్‌కు చెందిన వ్యాపారాలను ఆర్ ఆర్ వీఎల్ సొంతం చేసుకునే దిశగా ముందుకు సాగిందని, భారతీయ చట్టాల ప్రకారం అమలు జరుగుతుందని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆర్ ఆర్ వీఎల్ ఒప్పందం మేరకు నడుచుకుంటుందని, ఈ డీల్‌కు సంబంధించి పూర్తి ట్రాన్సాక్షన్స్ పూర్తి చేయాలని భావిస్తోందని, ఫ్యూచర్ గ్రూప్‌తో ఒప్పందం ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకుంటామని ఆర్ ఆర్ వీఎల్ తెలిపింది.

ఆర్ ఆర్ వీఎల్ తో రూ.24,700 కోట్ల ఒప్పందాన్ని విరమించుకుంటే మరో బలమైన,స్థిరమైన పెట్టుబడిదారుని తీసుకురావడంలో ఫ్యూచర్ గ్రూప్‌కు సహకరిస్తామని అమెజాన్ ఇండియా ఇటీవల తెలిపిన విషయం తెలిసిందే. రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌తో రూ.24,700 కోట్ల ఒప్పందాన్ని రద్దుచేసుకుంటే కొత్త భాగస్వామిని తీసుకువస్తామని లేదా పెట్టుబడి సంస్థలను తీసుకువస్తామని ఫ్యూచర్ గ్రూప్‌కు అమెజాన్ ఆఫర్ చేసింది. ఫ్యూచర్ కూపన్స్ ప్రయివేట్ లిమిటెడలో అమెజాన్‌కు 49 శాతం వాటా ఉంది. 2019లో దాదాపు రూ.1430 కోట్లను దీనిని కొనుగోలు చేసింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్–ఫ్యూచర్ గ్రూప్ మధ్య కుదిరిన ఒప్పందం వల్ల భారత్‌లో తమకు పోటీ మరింత ఎక్కువ అవుతుందనే భావన అమెజాన్‌లో ఉందని భావిస్తున్నారు. అందుకే ఫ్యూచర్ గ్రూప్‌ను ఆదుకునేందుకు అమెజాన్ ఆసక్తి చూపిస్తోందని అభిప్రాయపడుతున్నారు. కిషోర్ బియానీ నేతృత్వంలోని ఫ్యూచర్ గ్రూప్ రుణ సంక్షోభంలో చిక్కుకోవడంతో రిలయన్స్‌తో భారీ ఒప్పందం కుదుర్చుకుంది. కానీ రిలయన్స్–ఫ్యూచర్ గ్రూప్ ఒప్పందానికి అమెజాన్ ద్వారా చిక్కులు వచ్చాయి.

రిలయన్స్ ఇండస్ట్రీస్–ఫ్యూచర్ గ్రూప్ డీల్‌ను ఆర్బిట్రేషన్‌కు లాగింది అమెజాన్. ఫ్యూచర్ గ్రూప్‌తో తమతో కుదుర్చుకున్న ఒప్పందానికి రిలయన్స్–ఫ్యూచర్ గ్రూప్ డీల్ విరుద్ధమని సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌ను(ఎస్ఐఏసీ) ఆశ్రయించింది. నిబంధనల ఉల్లంఘనకుగాను ఫ్యూచర్ గ్రూప్‌లో భాగమైన ఫ్యూచర్ కూపన్స్‌కు లీగల్ నోటీసులు పంపించింది. ఈ డీల్‌ను నిలుపుదల చేయాలని కోరింది. దీంతో అమెజాన్‌కు తాత్కాలిక ఊరట లభించింది.

## గుజరాత్‌లో ఫేక్ కంపెనీని సృష్టించిన 25 ఏళ్ల కుర్రాడు

### -రూ. 50.2 కోట్ల జీఎస్టీ పన్నులను ఎగ్గొట్టే ప్రయత్నం

గుజరాత్, అక్టోబర్ 26(ఆర్ ఎన్ ఏ): జీఎస్టీ అధికారులనే 25 ఏళ్ల కుర్రాడు బురిడీ కొట్టించాడు. ఫేక్ కంపెనీని సృష్టించి ఏకంగా రూ. 50.2 కోట్ల పన్నులను ఎగ్గొట్టే ప్రయత్నం చేశాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వడోదరలోని సీఏ విద్యార్థి చేసిన ఈ పనితో అంతా అవాక్కయ్యారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రభుత్వానికి డబ్బు ఎగ్గొట్టాలనే పన్నాగంతో ఇలా తప్పుదారి పట్టించాడని అధికారులు తెలిపారు.

మనీష్ కుమార్ ఖత్రీ తన తెలివిని ఉపయోగించి జీఎస్టీని ఎగ్గొట్టాడు. 115 షల్ కంపెనీలు సృష్టించి వాటి నుంచి చెల్లించాల్సిన మొత్తాన్ని పక్కదారి పట్టించాడు. పన్నులు కట్టే వారి వివరాలను సేకరించే క్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆరా తీయగా..ఖత్రీ నకిలీ ఇన్‌వాయిస్‌లు సృ?ష్టించి పన్నులు ఎగ్గొట్టాడని తేలింది. దీని కోసం దాహుద్ అనే చిన్న గ్రామంలో ఉన్న అమాయకులను ఆసరగా చేసుకున్నాడు. వారితో బ్యాంక్ ఖాతా తెరిచి ఫేక్ కంపెనీలను సృష్టించాడు. దీనికి వారికి ప్రతి నెల ఎంతో కొంత ఇచ్చేవాడు.మరికొన్ని కంపెనీలకు పన్నులు ఎగ్గొట్టేందుకు సహకారం అందించేందుకు నకిలీ వెబ్ సైట్లతో కంపెనీలు కూడా సృష్టించాడని తేల్చారు.



